# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 10-06-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **బిజెపి సీనియర్ నాయకులు నరేంద్రమోదీ మూడవసారి ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.**
2. **ఆంధ్రప్రదేశ్‌లో ఈ నెల 13న పాఠశాలల్ని పునఃప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది.**
3. **తెలంగాణలో గ్రూప్-4 పోస్టుల భర్తీ ప్రక్రియలో ధ్రువపత్రాల పరిశీలనకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ - టీజీపీఎస్సీ తేదీని విడుదల చేసింది.**
4. **ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, "ఆంధ్రరత్న" బిరుదు పొందిన దుగ్గిరాల గోపాలకృష్ణయ్య వర్ధంతి ఈరోజు.**
5. **టీ20 ప్రపంచకప్‌లో నిన్న జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై భారత్ జట్టు 6 పరుగుల తేడాతో విజయం సాధించింది.**

==========================

సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన ఎన్డీయే కూటమి నూతన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహా 72 మందితో నూతన కేంద్ర మంత్రివర్గం ఏర్పాటైంది. వీరిలో 30 మంది క్యాబినెట్, ఐదుగురు స్వతంత్ర, 36 మంది సహాయ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. బిజెపి సీనియర్ నాయకులు నరేంద్రమోదీ మూడోసారి ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. నిన్న సాయంత్రం రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ ప్రమాణ స్వీకారం చేస్తూ,

వాయిస్ (41 సెకన్లు)

మరోవైపు తెలుగు రాష్ట్రాల నుంచి ఐదుగురు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఆంధ్రప్రదేశ్ నుంచి శ్రీకాకుళం పార్లమెంట్ సభ్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, తెలంగాణ బీజేపీ నుంచి జి.కిషన్ రెడ్డి కేంద్రమంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయగా.. ఆంధ్రప్రదేశ్ బీజేపీ తరపున నరసాపురం పార్లమెంట్ సభ్యులు శ్రీనివాస వర్మ, టీడీపీ నుంచి గుంటూరు పార్లమెంట్ సభ్యులు పెమ్మసాని చంద్రశేఖర్, తెలంగాణ బీజేపీ నుంచి బండి సంజయ్ సహాయ మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు.

------------------------

ఆంధ్రప్రదేశ్ లో ఈ నెల 13న పాఠశాలల్ని పునఃప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 12వ తేదీనే పాఠశాలలు తిరిగి తెరుచుకోవాల్సి ఉండగా.. ముఖ్యమంత్రిగా తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెసులుబాటు కల్పించాలని ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తి మేరకు, పాఠశాలల పునఃప్రారంభ తేదీని పొడిగిస్తూ పాఠశాల విద్యాశాఖ నిన్న ఉత్తర్వులు జారీ చేసింది.

---------------------------

తెలంగాణలో 8 వేల 180 గ్రూప్-4 పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా ధ్రువపత్రాల పరిశీలనకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ - టీజీపీఎస్సీ తేదీని ఖరారు చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరి 9న జనరల్ ర్యాంకుల జాబితాను ప్రకటించిన టీజీపీఎస్సీ, తాజాగా ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపికైన మెరిట్ అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. ధ్రువపత్రాల పరిశీలనకు వచ్చే ఎంపికైన అభ్యర్థులు తప్పనిసరిగా జూన్ 13 నుంచి వెబ్ ఐచ్ఛికాలను నమోదు చేసుకోవాలని సూచించింది. వారిని మాత్రమే విడతల వారీగా ధ్రువపత్రాల పరిశీలనకు అనుమతిస్తామని పేర్కొంది. అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకావాల్సిన రోజువారీ తేదీలను కమిషన్ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని తెలిపింది.

---------------------------

ఈ నెల 12వ తేదీన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. నిన్న రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా, కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీలతో కలిసి గన్నవరం మండలం కేసరపల్లి గ్రామ సమీపంలో జరుగుతున్న ప్రమాణ స్వీకార ఏర్పాట్లను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు విచ్చేయనున్నారన్నారని, అందుకు తగిన విధంగా ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. ప్రధాన సభాస్థలి వేదిక వద్ద, బారికేడింగ్ వంటి ఏర్పాట్లు చేయాలని, పార్కింగ్ ప్రదేశాల నుండి ప్రధాన సభకు చేరుకునేందుకు వీలుగా రహదారులను నిర్మించి, సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని చెప్పారు. కార్యక్రమాన్ని వీక్షించేందుకు వీలుగా సభ ప్రాంగణంతో పాటు వెలుపల ప్రదేశాలలో ఎల్ఈడి తెరలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఈ నెల 12వ తేదీన ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారోత్సవాన్ని పురస్కరించుకుని కృష్ణా జిల్లాలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగుతాయని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి తెలిపారు. గన్నవరం మండలం కేసరపల్లి ఐటీపార్కులో జరిగే కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పాటు ఇతర రాష్ట్రాల గవర్నర్లు, ఇతర ప్రముఖులు, అధికారులు హాజరు కానున్న నేపథ్యంలో ట్రాఫిక్‌కు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పలు మార్గాల్లో ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రయాణికులు ట్రాఫిక్ మళ్లింపును దృష్టిలో పెట్టుకుని 12వ తేదీ ప్రయాణాలను నిర్ణయించుకోవాలని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని అమరావతి రాజధాని ప్రాంతంలో ఆగిపోయిన నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ పరిశీలించారు. గుంటూరు జిల్లా ఉద్దండరాయునిపాలెంలో ప్రధానమంత్రి

శంకుస్థాపన చేసిన ప్రాంతాన్ని, సీఆర్డీయే కార్యాలయాన్ని, ప్రజాప్రతినిధుల నివాసాలు, అఖిలభారత సర్వీసు అధికారుల నివాసాలను పరిశీలించారు. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేసేలోపు రాజధానిలో పరిశుభ్రత పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ఐదేళ్లుగా ఎటువంటి పనులు చేయని భవనాల నాణ్యతపై ఇంజినీరింగ్ అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

--------------------------

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, "ఆంధ్రరత్న" బిరుదు పొందిన దుగ్గిరాల గోపాలకృష్ణయ్య వర్ధంతి ఈరోజు. కృష్ణాజిల్లా పెనుగంచిప్రోలులో 1889 జూన్ రెండవ తేదీన జన్మించిన ఆయన దక్షిణ భారతదేశం నుంచి భారత జాతీయ కాంగ్రెస్‌కు ప్రాతినిధ్యం వహించారు. ఇంగ్లాండ్‌లోని ఎడిన్ బరో విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఏ పట్టా పొందిన ఆయన అనిబిసెంట్ ప్రారంభించిన హోంరూల్ ఉద్యమంలో పాల్గొని చీరాలలో నిర్వహించిన పన్ను వ్యతిరేక ఉద్యమం ద్వారా పేరు ప్రఖ్యాతులు పొందారు. సంస్కృతాంధ్ర భాషలతో పాటు ఆంగ్ల, హిందీ భాషల్లో అనర్గళంగా మాట్లాడగలిగిన గోపాలకృష్ణయ్య అనంతర కాలంలో అనేక మంది ప్రముఖ రచయితలకు మార్గదర్శకులుగా నిలిచారు. 1928 జూన్ 10వ తేదీన 39 ఏళ్ళ చిన్న వయసులోనే ఆయన మరణించారు.

--------------------------

టీ20 ప్రపంచకప్‌లో భాగంగా న్యూయార్క్ వేదికగా నిన్న జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో పాకిస్తాన్ పై భారత్ జట్టు 6 పరుగుల తేడాతో విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు 19 ఓవర్లలో 119 పరుగులను చేసింది. తదుపరి 120 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ జట్టు 20 ఓవర్లలో 7 వికెట్లకు 113 పరుగులు చేయగా భారత్ 6 పరుగుల తేడాతో పాకిస్తాన్ పై విజయం సాధించింది.

--------------------------

నైరుతి రుతుపవనాలు ఆంధ్రప్రదేశ్‌లో క్రమంగా విస్తరించి చురుగ్గా కదులుతున్నట్లు అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ ప్రభావంతో రాగల 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. బంగాళాఖాతంలో రుతుపవనాల ప్రభావం బలంగా ఉండడంతో తీరం వెంబడి గంటకు 45- 55 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తున్నాయని, మూడు రోజులు పాటు మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని వాతావరణ శాఖ హెచ్చరించింది.

నైరుతి రుతుపవనాల ప్రభావంతో నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో తెలంగాణకు పసుపు రంగు హెచ్చరికను హైదరాబాద్ వాతావరణ కేంద్రం జారీ చేసింది తెలంగాణలోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు మరిన్ని ప్రాంతాలకు విస్తరించే అవకాశం ఉందని తెలిపింది. హైదరాబాద్‌తో పాటు తెలంగాణాలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

--------------------------

యాసంగి సీజన్‌లో తెలంగాణ వ్యాప్తంగా 7 వేల 178 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయగా, 6 వేల 345 కేంద్రాల ద్వారా 47.07 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు జరిగాయని రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. ధాన్యం విక్రయించిన 8 లక్షల 35 వేల 109 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో 10 వేల 355.18 కోట్ల రూపాయలు జమచేసినట్టు తెలిపింది. వడ్లు విక్రయించిన మూడు రోజుల్లోనే నగదును రైతుల ఖాతాలో జమచేశామని పేర్కొంది. ధాన్యం సేకరణలో జగిత్యాల, కామారెడ్డి, కరీంనగర్, మెదక్, నల్గొండ, నిజామాబాద్, పెద్దపల్లి,

సిద్దిపేట, సిరిసిల్ల, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, నిర్మల్, మంచిర్యాల, జనగామ జిల్లాలు ముందంజలో ఉన్నాయని తెలిపింది.

---------------------------

రామోజీ గ్రూపు సంస్థల ఛైర్మన్ రామోజీరావు అంత్యక్రియలు తెలంగాణ ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిన్న ముగిశాయి. రామోజీ ఫిల్మ్‌సిటీలో గౌరవ సూచకంగా పోలీసులు గాల్లోకి కాల్పులు జరపగా ఆయన అంతిమ సంస్కారాలు ముగిశాయి. అంత్యక్రియల్లో తెలంగాణ మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, సీతక్క, తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుతో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

======================